VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 16

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 21 మే 2025




## ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు

జనం కోసం, జనం నుండి వచ్చిన, జనం మెచ్చిన నేత,
జన హృదయ విశ్వాస విజేత, జనం ఇచ్చిన ఆశీర్వాద బలంతో,
జనం కోసం పుట్టిన నేత... ఆయన పేరే ఓ ప్రభంజనం.
ఆయనే... **డాలర్స్ దివాకర్ రెడ్డి.**
ఆయన ఎక్కడికి వెళ్లినా జన నీరాజనం...
అశేష ప్రజానీక హృదయగళం...చంద్రగిరి ప్రజలకు ఆయన బలం...
తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాలలో
పాలుపంచుకునే అందరివాడు....ఆయనే....
మా / మీ / మనందరి.. **డాలర్స్ దివాకర్ రెడ్డి.**
మంచికి మారుపేరు, మొహంలో చిరునవ్వు, ఆత్మీయ పలకరింపు,
ఆపదలో ఆదుకొనే తత్వం, యువతకు స్ఫూర్తి ప్రదాత,
రియల్ ఎస్టేట్ రారాజు, పట్టు వదలని విక్రమార్కుడు, భగీరథుడు,
రాజకీయాల్లో మచ్చ లేని నాయకుడు, నిజాయితీకి నిలువెత్తు రూపం,
మాట తప్పని నైజం, సమాజ సేవకుడు, ఎంతో మంది విద్యార్థులకు
విద్యా దాతగా, డయాలసిస్ రోగులకు ప్రాణ దాతగా,
ఎవరు...ఎప్పుడు... ఎలా పిలిచినా నేనున్నా అంటూ
ఒక కుటుంబ సభ్యునిగా వెంటనే పలికే
మన **"దివాకర్ అన్న"**
తిరుపతిలోని ప్రతిష్టాత్మకమైన **"తుడా చైర్మన్"** గా
నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు.
కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని ఆశీస్సులు
ఉండాలని కోరుకుంటూ....



## డాలర్స్ యువ సేన

డాలర్స్ దివాకర్ రెడ్డి గారు
తుడా చైర్మన్

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయండి - కమిషనర్ ఎన్.మౌర్య





**తిరుపతి,కలంకౌంటర్ :** నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన, రాజీవ్ గాంధీ కాలని తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్య పనులను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవకోన వంటి ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కగా చేయాలని, ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. చెత్త తొలగించడం, కాలువలు శుభ్రం చేయడం వంటివి ప్రణాళికాబద్దంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి, తదితరులు ఉన్నారు.


## గోల్డ్ కాయిన్ లు అందజేత





**చీరాల,కలంకౌంటర్ :** వాసవి కుటుంబ సురక్ష పథకలో (VKSP) ఉన్న సభ్యులు వారు పథకంలో చేరిన నాటినుండి ఎటువంటి నెగటివ్ బ్యాలెన్స్ లేకుండా ఉంచడం వలన వారిని గుర్తించి VCI వారు V205A జిల్లా తరఫున 43 మందికి చిరు సత్కారంగా గోల్డ్ కాయిన్ లను V205A జిల్లా గవర్నర్ చుండూరి గాయత్రి , క్యాబినెట్ సెక్రటరీ మారుటూరి రాఘవేంద్రరావు ద్వారా అందజేశారు.

## రేషన్ వ్యాన్ల రద్దు:మంత్రి నాదెండ్ల



**విజయవాడ, కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఇకపై రేషన్ వ్యానులు ఉండవని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాలకు వెళ్లి లబ్ధిదారులు బియ్యం తీసుకోవాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం డోర్ డెలివరీ అవకాశం ఉంటుందని చెప్పారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

**తెలంగాణ, కలంకౌంటర్ :** తెలంగాణలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మినీ అంగన్‌వాడీలను పూర్తిస్థాయి అంగన్‌వాడీలుగా గుర్తించి, వారికి పెంచిన వేతనం పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 3,989 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నిరుపేద వర్గాలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారని హరీశ్ రావు తన లేఖలో గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి సేవలను గుర్తించి, 2023 సెప్టెంబర్ 5వ తేదీన వారిని అంగన్‌వాడీలుగా ప్రమోట్ చేస్తూ జీవో జారీ చేసిందని తెలిపారు.

# తిరుమలకొండపై పచ్చదనాన్ని మరింత పెంచుతాం

### - టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు





**తిరుమల,కలంకౌంటర్ :** తిరుమలలోని అన్నమయ్య భవన్ లో మంగళవారం టీటీటీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ధర్మకర్తల మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను టీటీడీ ఈవో జె.శ్యామలరావు మీడియాకు వివరించారు.

**టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం ముఖ్య నిర్ణయాలు..**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో ఉన్న పచ్చదనాన్నిఅటవీశాఖ ద్వారా 68.14 శాతం నుండి 80 శాతానికి పెంచేందుకు నిర్ణయం. ప్రభుత్వ ఆమోదం వచ్చాక దశలవారీగా 2025-26 సంవత్సరంలో రూ.1.74కోట్లు, 2026-27 సంవత్సరంలో రూ.1.13కోట్లు, 2027-28 సంవత్సరానికి రూ.1.13కోట్లు ప్రభుత్వ అటవీశాఖకు విడుదల చేసేందుకు నిర్ణయం. - తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాల అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్ ల నుండి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం. -తిరుమలలోని విశ్రాంత భవనాల పేర్లు మార్పులో మిగిలిన ఇద్దరు దాతలు స్పందించలేదు. దీంతో ఈ విశ్రాంతి గృహాల పేర్లను టీటీడీనే మార్పు చేయాలని నిర్ణయం. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. -తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశంపై ఆమోదం. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు ఇవ్వాలని నిర్ణయం.- ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాలను భక్తులు విశేష సంఖ్యలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయం.- రాయలసీమకే తలమానికంగా ఉంటూ ఎందరో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఆర్థిక సహాయంగా ఏడాదికి ఇప్పుడు అందిస్తున్న రూ.60కోట్లతో పాటు అదనంగా మరో రూ.71 కోట్లు అందించేందుకు ఆమోదం. స్విమ్స్ మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది నియామకం చేపట్టేందుకు నిర్ణయం. అదేవిధంగా 85శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవంతులను (ఆంకాలజీ మరియు పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రిలతో కలిపి) త్వరలోనే మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా నిర్ణయం. శ్రీవారి వైద్య సేవను కూడా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం. - టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్తులను బదిలీ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, స్వచ్ఛంద పదవీ విరమణకు చర్యలు తీసుకునేందుకు ఆమోదం. - తిరుమల ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని యాంటీ డ్రోన్ టెక్నాలజీ వాడాలని నిర్ణయం. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం. - ఒంటిమిట్టలో భక్తులకు అన్నదానం సేవలను మరింత పెంచాలని నిర్ణయం. - తుళ్లూరు మండలం అనంతవరంలోని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయం. ఇందుకు రూ.10 కోట్లు కేటాయించేందుకు ఆమోదం. - శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్స్ట్ లెవల్ చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయం.

## ధీరోధాత్తుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు



**కందుకూరు,కలంకౌంటర్ :** ధీరోధాత్తుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, న్యాయవాది రావులకొల్లు వెంకటేశ్వర్లు (ఆర్ వి )అన్నారు. ఆంధ్ర కేసరి సేవా సమితి అధ్యక్షులు మంచి రాజు మురళీమోహన్ సూచనతో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమం పట్టణంలోని కోవూరు రోడ్డు వద్దనున్న ప్రకాశం పంతులు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత ఆంధ్ర కేసరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలు ఎనలేనివే అని అన్నారు. సైమన్ కమిషన్ కు ఎదురొడ్డి బ్రిటిష్ తుపాకీ కి తన గుండెను చూపించి కాల్చమనిన దీశాలి ఆంధ్ర కేసరి టంగుటూరు ప్రకాశం పంతులని అన్నారు. తన యావదాస్తిని స్వాతంత్రోద్యమం కోసం త్యాగం చేసిన త్యాగమూర్తి ఆంధ్రకేసరి అని కొనియాడారు. ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నందనవనం రామ సుబ్బారావు, డాక్టర్ తన్నీరు మల్లిఖార్జునరావు, నారాయణం రాధాకృష్ణమాచార్యులు, పెట్లూరి సుబ్బారావు, డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, కే.ఎస్.వెంకటేశ్వర్లు, రావులకొల్లు వెంకటేశ్వర్లు(ఆర్.వి.), రావులకొల్లు బ్రహ్మానందం, ఏ.వి.రావు,పిన్నమరాజు సురేష్,గాదిరాజు నాగరాజు, బి.జె.పి.వరప్రసాదరావు, శ్రీనివాసదీక్షితులు, జీ.వి.శేషగిరిరావు, వాకాణి శేషాచార్యులు,కాకర్ల రాజగోపాల్, గణపతిరాజు వాసుదేవరావు, కోట కిషోర్, చీదెండ్ల కృష్ణ, సామాను బ్రహ్మయ్య, తదితరులు హాజరయ్యారు.

# నెట్టెం కు జన్మ దిన శుభాకాంక్షలు





**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** మాజీ మంత్రి,ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, నియోజకవర్గ అబ్జర్వర్ దొంతు చిన్న , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర రఘురామ్ నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు.

# అంబరాన్ని అంటిన మినీ మహానాడు మహోత్సవం..











**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా పట్టణంలో చిలకలు రోడ్డులో గల శుభమస్తు ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మినీ మహానాడు ను శాసనసభ్యులుశ్రీరాం రాజగోపాల్ తాతయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పతాకావిష్కరణ చేసి అన్న నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించినారు. అనంతరం ఆపరేషన్ సింధూరలో అమరులైన వీర జవాన్ మురళి నాయక్ నకు మరియు పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన దేశ పౌరులకు నివాళులు మరియు గత సంవత్సర కాలంలో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి అమరులైన కార్యకర్తలకు కూడా నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలో వివిధ గ్రామాలలో నూతనంగా ఎన్నిక కాబడిన గ్రామ, పట్టణ, వార్డు, మండల అధ్యక్షులచే ప్రమాణ స్వీకారం చేయించినారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య అంశాలను అభివృద్ధి, సంక్షేమంపై వక్తలందరూ మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) , ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ , ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ , పార్టీ పరిశీలకులు దొంతు చిన్న నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయుచు తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించబడినది. సదరు తీర్మానాలను జిల్లా పార్టీ ద్వారా రాష్ట్ర పార్టీ మహానాడుకు ప్రతిపాదించి ఆమోదం కోసం పంపారు. ఈ మహానాడు సందర్భంగా మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం జన్మదినోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ. నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులు, ఇన్చార్జులు, ప్రధాన కార్యదర్శులు , అనుబంధ సంఘాల నాయకులకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోలంపల్లి ఎత్తిపోతల పథకం, కంచల వేదాద్రి ఎత్తిపోతల పథకానికి నెలకొన్న సమస్యలు పరిష్కారానికి రెండు నెలల్లో బడ్జెట్ రిలీజ్ అవుతుందని అన్నారు... ప్రభుత్వ కళాశాలకి డిపిఆర్ సిద్ధం అయింది త్వరలోనే ప్రభుత్వ కళాశాల జగ్గయ్యపేటకు రానుందని తెలిపారు. జగ్గయ్యపేటలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయి ఇంకా యువతకి ఉపాధి కల్పించడానికి రెండువేల ఎకరాలు సర్వే జరిగింది.. జగ్గయ్యపేట, నందిగామలో ఇండస్ట్రియల్ క్లస్టర్ రాబోతుంది... రాజధాని అమరావతికి దగ్గర్లోనే నందిగామ, జగ్గయ్యపేట ఉండటం వలన అన్ని రకాలుగా అభివృద్ధి జరుగుతుందనీ అన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది మాసాల్లోనే అధికారంలోకి వచ్చిన పార్టీ తెలుగుదేశం అన్నారు. అన్న ఎన్టీఆర్ తెలుగుజాతి ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణకు, పేదలకు కూడు, గుడ్డ, నీడ కల్పించాలనే దృఢ సంకల్పంతో టీడీపీని స్థాపించారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలకు పునాది వేసింది అన్న ఎన్టీఆర్ ని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం నారా చంద్రబాబు నాయుడు జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో పార్టీ పటిష్టం కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటానన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఆలోచిస్తుంటే, జగన్ మాత్రం రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకోవాలా అనే ఆలోచనతోనే పరిపాలన కొనసాగించాడన్నారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన మద్యం కుంభకోణమే ఇందుకు ప్రధాన నిదర్శనం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఇసుక, మద్యం పాలసీ దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. జె బ్రాండ్ మద్యంతో నాసిరకం మద్యాన్ని అంటగట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. సిట్ విచారణలో మద్యం కుంభకోణం వాస్తవాలు వెలుగుచూస్తున్నాయని ఇది రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలిసిన నగ్నసత్యం అన్నారు. దీనికి కూడా జగన్మోహన్ రెడ్డి రాజకీయ రంగు పులుముతున్నారని విమర్శించారు. ప్రజావేదిక కూల్చివేత నుంచి జగన్ విధ్వంసం ఆరంభమైందన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అక్రమాలను ఎటువంటి పరిస్థితుల్లో సహించదన్నారు. నీతి, నిజాయితీ క్రమశిక్షణకు మారుపేరైన మంత్రి నారా లోకేష్ తాత ఎన్టీఆర్, తండ్రి సీఎం చంద్రబాబు నాయుడు లక్షణాలను పుణికి పుచ్చుకొని అక్రమార్కుల పాలిట సింహస్వప్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. 2029లో కూడా పార్టీ గెలుపే లక్ష్యంగా అందరం కృషి చేయాలన్నారు.





## శ్రీ శృంగేరి శంకర మఠం మహాద్వారం ప్రారంభోత్సవం దృశ్యాలు..

-నరసరావుపేట,కలంకౌంటర్ :

# ప్రకాశం పంతులు త్యాగాలు చిరస్మరణీయం - జిల్లా ఎస్పీ




**ఒంగోలు,కలంకౌంటర్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి గా పేరుగాంచిన స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ, పోలీస్ అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు 1872 ఆగష్టు 23 న ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, వినోదరాయుని పాలెం గ్రామంలో సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారన్నారు. చిన్నతనంలో కష్టపడి విద్యాభ్యాసం చేసి లండన్ లో బారిష్టర్ పాసై ప్రముఖ న్యాయ వాదిగా సేవలందించారని, గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, మేధావి, ధీరుడు, కార్యదక్షుడని, మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటిష్ పోలీసుల తుపాకీ తూటాలకు ఎదురుగా గుండె చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేనిదని, ప్రత్యేకంగా రాష్ట్ర సాధనలో నిర్ణయక పాత్ర పోషించాడని, 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా ప్రజాసేవకుడయ్యారని, ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు ఎప్పటికీ ఆదర్శప్రాయమన్నారు. తెలుగు జాతికి చేసిన సేవలను గుర్తుగా 1972 డిసెంబర్ 5న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారని, ప్రకాశం పంతులు తెలుగువారి తెగువకు, నిబద్ధత, ధైర్యం, సమైక్యతకు నిలువెత్తు నిదర్శనమని, అలాంటి మహనీయుని జీవితాన్ని, ధైర్యసాహసాలు, పోరాట పటిమను నేటి, భావితరాలు ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఇన్స్పెక్టర్ జగదీష్, ఆర్ఐ రమణ రెడ్డి, ఏఆర్ ఎస్సైలు ప్రసాద్, పాపి రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం





**కొణిజర్ల (తెలంగాణ),కలంకౌంటర్ :** కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన తాటిపల్లి రణధీర్ చౌదరి,ముక్కా భాను ప్రకాష్ చౌదరి జూనియర్ ఎన్టీఆర్ 42వ పుట్టిన రోజు సందర్భంగా ఖమ్మం లో తలసేమియా పిల్లల కోసం ప్రముఖ వైద్యులు కూరపాటి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ లో రక్త దానం చేశారు.జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజున రక్తదానం చేసిన రణధీర్ చౌదరి కి భాను ప్రకాష్ చౌదరి కి డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ,ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ సర్టిఫికెట్ అందచేయడం జరిగింది. కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ తలసేమియా పిల్లలకు ప్రతి 15 రోజులకొకసారి బ్లడ్ అవసరం అవుతుందని కావున ప్రతి ఒక్కరు బ్లడ్ డొనేట్ చేస్తే తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు ఈ బ్లడ్ ఉపయోగపడుతుందని ప్రదీప్ కుమార్ జూనియర్ ఎన్టీఆర్ బర్త్డే సందర్భంగా బ్లడ్ ఇచ్చిన రణధీర్ చౌదరిని భాను ప్రకాష్ చౌదరిని అభినందిచారు

# మజ్జిగ పంపిణీ




**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు

# పెండ్లి కుమార్తెను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలోని తానికొండవారిపాలెం నకు చెందిన మద్రిపూడి సింగయ్య కుమార్తె హారిక చౌదరి వివాహం సందర్భంగా మంగళవారం ఇంటి వద్ద జరిగిన నలుగు కార్యక్రమానికి హాజరై హారిక చౌదరిని ఆశీర్వదించిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు.

# జిల్లాలో పనితీరు మెరుగుపరుచుకుని ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంపొందించేందుకు కృషి చేయాలి

● రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ గ్రీవెన్స్ అధికారి( సి జి ఓ) చిన్నారావు అధికారులకు సూచించారు




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** సామాన్యుని సమస్యను సానుభూతితో ఓపికగా ఆలకించి పరిష్కరించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ విధానమని, జిల్లాలో పనితీరు మెరుగుపరుచుకుని ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంపొందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ గ్రీవెన్స్ అధికారి( సి జి ఓ) చిన్నారావు అధికారులకు సూచించారు మంగళవారం ఉదయం ఆయన ముఖ్యమంత్రి కార్యాలయం నుండి కృష్ణాజిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) మీకోసం కార్యక్రమం, అర్జీల పరిష్కారం, ప్రజల్లో సంతృప్తి స్థాయి తదితర అంశాల పై జూమ్ ద్వారా శిక్షణతో పాటు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిజిఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల సంతృప్తి చాలా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్క అధికారి సామాన్యుని మాట వినిపించుకోవాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు. సాటి మనిషి పైన కాస్త దయ, సానుభూతి చూపాలని పౌరులకు సేవ చేయడానికి మించినది ఏమీ లేదని స్పష్టం చేశారు. గతంలో కృష్ణాజిల్లా ప్రజా సమస్యల పరిష్కారంలో పనితీరు బాగుండేదని ప్రస్తుతం బాగా వెనుకబడిందన్నారు. సమస్యలు పరిష్కరించిన అర్జీదారులతో నేరుగా మాట్లాడటం జరుగుతుందని వారి సమస్య ఏ మేరకు పరిష్కారం అయిందో అభిప్రాయం అడిగి తెలుసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఉంగుటూరు, గూడూరు మండలాల్లో ప్రజల సంతృప్తి స్థాయి చాలా బాగుందంటూ ఏ విధంగా ప్రజలతో మాట్లాడేవారో సంబంధిత తహసీల్దారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లా పౌరసరఫరాల అధికారి పని తీరు కూడా చాలా బాగుందని పేర్కొంటూ డీఎస్ఓ పార్వతితో ఎలా సాధించగలిగారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారంతా అర్జీదారులతో ఎంతో ఓపికగా సానుకూలంగా మాట్లాడి వారి సమ–స్యను తెలుసుకుని సావధానంగా సమాధానం చెప్పడం వల్ల అది సాధ్యమైందని వారు సిజిఓకు వివరించారు. ఏ అధికారైన తమ వద్దకు అర్జీదారుడు వచ్చినప్పుడు తాము ఎంత పని వత్తిడిలో ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా కొంత సమయం వారికి కేటాయించి మాట్లాడినప్పుడు ప్రజల్లో సంతృప్తి వస్తుందన్నారు. విచారణకు వెళ్లే కింది స్థాయి ఉద్యోగులు అర్జీదారులతో ఏం మాట్లాడుతున్నారో సంబంధిత శాఖ పరిష్కార అధికారికి తెలియడం లేదన్నారు. ఆ ఉద్యోగులు సావధానంగా మాట్లాడకపోవడం వల్ల సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. అటువంటి చిన్న చిన్న తప్పులు జరుగుతున్నాయని, లోపాలు ఉంటున్నాయని వాటిని సరి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అర్జీదారులతో ప్రేమాభిమానంతో మాట్లాడాలని ఇకనైనా ఉద్యోగులలో మార్పు రావాలన్నారు. ముఖ్యంగా అర్జీదారులకు వీలున్నంతవరకు సహాయం చేసే విధంగా పనిచేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో ఉన్నతాధికారులు వారికి సంబంధించిన అర్జీలు ఎలా పరిష్కరిస్తున్నారో సరిగా ఆడిట్ చేయకపోవడం వల్లనే ప్రజల్లో సంతృప్త స్థాయి తగ్గిపోవడానికి కారణం అవుతూ ఉందన్నారు. కృష్ణాజిల్లాలో తోట్లవల్లూరు, అవనిగడ్డ, నాగాయలంక, పెనమలూరు, నందివాడ తదితర మండలాల్లో ప్రభుత్వ పాలనపట్ల ప్రజల్లో అసంతృప్తి స్థాయి ఎక్కువగా ఉందన్నారు. అక్కడ మండల ప్రత్యేక అధికారులను చొరవ చూపి మండలాధికారుల పనితీరులో మార్పు వచ్చేలా చేసి ప్రజల సంతృప్తి సాయి పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఏ పనైనా చేయగలిగితే వెంటనే చేయాలని లేని పక్షంలో ఎందుకు వీలు కాలేదు కారణాలు అర్థమయ్యే విధంగా తెలియజేస్తూ అర్జీదారునికి తెలియజేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ శాఖలు మండలాల పనితీరు ఎలా ఉందో విశ్లేషణ నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేస్తున్నామన్నారు. మరల వచ్చే నెల ఇదే తేదీన సమీక్షిస్తామని ఆలోగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పనితీరులో మార్పు తెచ్చుకొని ప్రజల్లో సంతృప్త స్థాయిని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ నగరంలోని కలెక్టరేట్ వీసీ హాల్ నుండి పాల్గొని మాట్లాడుతూ చాలా ప్రభుత్వ శాఖల్లో పనితీరు సరిగా లేదని ప్రజల్లో సంతృప్తి స్థాయి చాలా తక్కువగా ఉందని ఇకనైనా పనితీరు మార్చుకొని ప్రజల్లో సంతృప్త స్థాయిని మరింత పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారులతో ముఖ్యమంత్రి కార్యాలయం నుండి నేరుగా కాల్ సెంటర్ 1100 నెంబర్ నుండి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారని దాని విశ్లేషణ ఆధారంగా ప్రభుత్వ శాఖల అధికారుల కు ర్యాంకింగ్ ఇస్తున్నారన్నారు. ఇకనైనా ప్రజా సమస్యల పట్ల వెంటనే స్పందించి వారితో సానుకూలంగా మాట్లాడి అర్జీల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో ప్రజల సంతృప్తి స్థాయి చాలా కీలకమని అన్నారు మండలాల్లో పరిపాలన విధానం బాగాలేదని ప్రజలు చెబుతున్నట్లు నివేదికలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే జూన్ మాసం 12వ తేదీ నుండి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని చెప్పారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలవుతున్నాయి, ప్రజల సమస్యలు పరిష్కారంలో మీకోసం కార్యక్రమం ఏ మేరకు సేవలు అందిస్తోంది, ప్రజల సంతృప్తస్థాయి ఎంత మేరకు ఉంది అనే అంశాలను ముఖ్యమంత్రి పరిశీలిస్తారన్నారు. ప్రజల సంతృప్తి మేరకు వారి సమస్యలు పరిష్కారం అవుతున్నాయా లేదా అని విచారిస్తారన్నారు. ప్రజల సమస్యలు సానుకూలంగా పరిష్కారం అవుతున్నాయా లేదా ఏమైనా సమస్యలు ఉన్న చట్టపరిధిలో వీలుకాకుంటే ఆ విషయాలను ప్రజలకు సజావుగా వారికి అర్థమయ్యే రీతిలో తెలియజేస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీస్తారన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి నేరుగా అర్జీదారులకు ఫోన్లు చేయడం జరుగుతుందని ఇంటికి ఎవరైనా అధికారులు వచ్చారా లేదా విచారణ జరిపారా లేదా వారి పని పూర్తి అయిందా లేదా కాకుంటే అధికారుల స్పందన ఎలాగుంది అనే వివరాలను అడిగి తెలుసుకుంటున్నారన్నారు. విచారణకు వెళుతున్న కిందిస్థాయి ఉద్యోగులు అర్జీదారులతో సావధానంగా మాట్లాడటం లేదని కొంతమంది మరి అసభ్యకరంగా మాట్లాడుతున్నారని వారిలో సరైన స్పందన ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విచారణ ఉద్యోగులు వారితో మాట్లాడిన విషయాలను రికార్డు చేసి మరి ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని, ఇకనైనా అధికారులు తమ పనితీరు, మాట తీరు, ప్రవర్తన మార్చుకొని సజావుగా నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరి సమ–స్యలు తీర్చలేమని ఆ విషయం సానుకూలంగా చెప్పాల్సి ఉందన్నారు. ముఖ్యంగా విచారణకు వెళ్లే కిందిస్థాయి ఉద్యోగులకు అర్జీదారులతో మర్యాదపూర్వకంగా ఎలా మాట్లాడాలో తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎక్కువగా పోలీసు, రెవెన్యూ శాఖలపై ప్రజల నుండి వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. అర్జీదారునికి అర్జీదారునితో నేరుగా మాట్లాడి వారి సమస్యను సానుకూలంగా తెలుసుకొని ఫోటో తీసుకోవాలని, అర్జీ పై తగిన చర్యలు తీసుకొని సమాధానం నేరుగా గాని, వీలుకానిపక్షంలో వాట్సఅప్ ద్వారా గాని పంపాలన్నారు. సమాధానం వారికి అందినట్లుగా రసీదు పొందాలన్నారు. ఒకవేళ పరిష్కరించిన అర్జీ మరల వచ్చినట్లయితే అందులోని తప్పులను గమనించి సరిదిద్దుకొని సరైన చర్యలు తీసుకుంటే ప్రజలలో సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు వారి కింది స్థాయి ఉద్యోగులు ఏ విధంగా సమస్యను పరిష్కరించారో ఒకసారి సంబంధిత అర్జీదారులతో మాట్లాడి తెలుసుకున్నాకనే వారికి సమాధానం పంపాలన్నారు. కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ మీకోసం కార్యక్రమం నిర్వహించినప్పుడు జిల్లా మండల స్థాయిలో డివిజన్ మండల స్థాయిలో ప్రజల నుండి అర్జీలు వస్తుంటాయని వాటితో పాటు ప్రజాప్రతినిధుల నుండి, రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించే ప్రజావేదిక నుండి, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కార్యాలయం నుండి కూడా అర్జీలు వస్తుంటాయన్నారు. అర్జీదారులు వచ్చినప్పుడు వారితో మర్యాదపూ–ర్వకంగా మాట్లాడి వారి సమస్యను ఎంతో ఓపికగా పూర్తిగా వినాల్సి ఉంటుందన్నారు. అర్జీదారుని స్థానంలో మనం ఊహించుకొని వారి బాధను మన బాధగా భావించి వారి సమస్యను పరిష్కరించాలన్నారు. సంబంధం లేని అర్జీ ఏదైనా ఒక ప్రభుత్వ శాఖ అధికారికి వస్తే కాలం వృధా చేయకుండా వెంటనే అది వారి పరిధిలో లేదని సంబంధిత అర్జీదారునికి తెలియజేయాల్సి ఉందన్నారు. కొంతమంది అధికారులు ఆన్లైన్లో వచ్చిన అర్జీలను సరిగా చూడటం లేదని వెంటనే వాటిని చూసి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. విచారణకు వెళ్లే అధికారి గాని ఉద్యోగి గాని సంబంధిత అర్జీదారునికి ముందుగా సమాచారం అందించాలని, విచారించాక అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో తెలుగులోనే సమాధానం సంబంధిత విఆర్ఓ లేదా సచివాలయము సిబ్బంది, సంబంధిత శాఖల సిబ్బంది ద్వారా పంపాలన్నారు. వారు వేరే ప్రాంతాల్లో నివసిస్తున్నట్లయితే రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపాలన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖ నుండి సమాధానాలు ఆంగ్ల భాషలో వస్తున్నాయని ఇకనుంచి తెలుగులో పంపేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా అధికారికి అర్జీ వచ్చినప్పుడు అది వారి పరిధిలో పరిష్కారం చేయగలిగితే వెంటనే చేయాలని, చట్టపరిధిలో అర్హతలు లేక చేయలేకపోతే అందుకు గల కారణాలను వివరిస్తూ వారితో మాట్లాడి సమాధానం పంపాలన్నారు సంబంధిత అధికారికి తెలిసే ఏదైనా సమస్య పరిష్కారం కావాలని క్రింది స్థాయి ఉద్యోగులకు ఏమాత్రం అప్పగించరాదన్నారు ఒకే విషయం పైన మరల అర్జీ పెట్టుకునే పరిస్థితి రాకుండా సమాధానం సరిగా సంబంధిత అర్జీదారునికి పంపాలన్నారు. ఈ జూమ్ శిక్షణ సమావేశంలో డీఎస్ఓ పార్వతి, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ వాణి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, పౌరసరఫరాల సంస్థ డిఎం శిరీష, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజా, డి ఆర్ డి ఎ పి డి హరిహరనాధు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నాగరాజు,మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, డీఈవో రామారావు, ఆర్టిఓ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అధికారులను అప్రమత్తం చేశాం

● కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు ● ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా సమాచారమివ్వండి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, మునిసిపల్, వ్యవసాయ తదితర శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా 9154 970 454 నంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ) ఏర్పాటు చేశామని.. ప్రజలు తమకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఈ నంబరులో సంప్రదించి, సమాచారమివ్వాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా, సరఫరాలో ఆటంకం లేకుండా పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, నిరంతరం పరిస్థితిని సమీక్షించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా.. రోడ్లపై నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపేందుకు అవసరమైన సిబ్బంది, ఇంజిన్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఎక్కడైనా చెట్లు కూలితే వెంటనే తొలగించేలా ఆదేశాలిచ్చామన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని.. చెట్ల కింద నిలుచోవడం వంటివి చేయొద్దని, వాహనాలను భద్రమైన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలని, వర్షాలు పడే సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సహాయక చర్యలు అవసరమైనా చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పంటల రక్షణకు సంబంధించి తగు సూచనలు చేయాలన్నారు. ఒకవేళ విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే వెంటనే పునరుద్ధరించి, సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

# సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర





**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ , గనులు & భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన కొల్లు రవీంద్ర ని ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ అర్చకులు బుద్ధుడు పవన్ కుమార్ శర్మ బుద్ధ సతీష్ శర్మ ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకునారు .అనంతరం కొల్లు రవీంద్ర శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ అర్చకులు పూజలు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ని ఆలయ మర్యాదలతో శ్రీరామ వరప్రసాదరావు ఘనంగా సత్కరించి, ప్రసాదాలను అందజేసి, శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెంట్ మధుసూదనరావు , అర్చకులు విరూప్ కుమార్ శర్మ, మణిదీప్ ,తెలుగుదేశం పార్టీ నాయకులు నడకుదుటి జనార్ధన్ రావు, రావిరత్నగిరి విశ్వంశెట్టి రాజా,కొల్లి మురళి పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని ఎగ దోస్తోన్న పాకిస్థాన్

- మనం సైతం.. దేశం కోసం తిరంగా ర్యాలీలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్






**మల్కాజిగిరి, కలంకౌంటర్ :** భారత దేశంతో పాకిస్థాన్ దశాబ్దాలుగా కొనసాగిస్తూనే ఉందని, నేరుగా తలపడితే భారత్ ను గెలవలేమని భావించిన పాకిస్థాన్ దొంగ దారిన దెబ్బ తీసేందుకు ఉగ్రవాదాన్ని ఎగదోస్తోందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఆరోపించారు. మోడీ నాయకత్వంలో ప్రపంచంలో అతి వేగంగా ఎదుగుతున్న భారత దేశాన్ని ఇబ్బందులు పెట్టాలన్న దుర్మార్గమైన ఆలోచనతో పాకిస్థాన్ కుయుక్తులకు అడ్డుకట్ట వేసేలా ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. మంగళ వారం సాయంత్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పట్టణంలోని ఎండిఓ కార్యాలయం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకోవాలని ప్రతి భారతీయుడు కోరుకున్నారని, కలలో కూడా ఊహించని విధంగా ఉగ్రవాదులను శిక్షిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ సైతం వ్యాఖ్యానించారని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. భారత్ వస్తే ఎలా బుద్ధి చెబుతామో మన సైనికులు ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్థాన్ కు రుచి చూపించారని అన్నారు. భారత సైన్యానికి తోడుగా అండగా మేమున్నామని ప్రధాని మోడీ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మనం సైతం.. దేశం కోసం తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. సుశిక్షితులైన మన బలగాలు పాకిస్థాన్ దాడులను సమర్థవంతంగా తిప్పి కొట్టడమే కాకుండా వారి వైమానిక స్థావరాలు, సైనిక శిబిరాలను ధ్వంసం చేశాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యంలో పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత సైన్యానికి దేశమంతా ఏకమై అభినందనలు, ప్రశంసలు తెలుపుతోన్న తరుణంలో త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా మన ఐక్యత చాటడానికి బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా ఆధ్వర్యంలో మేడ్చల్ ఎం డి ఓ ఆఫీస్ నుండి స్వామి వివేకానంద విగ్రహం వరకు నిర్వహించిన తిరంగా యాత్ర లో ఎంపీ ఈటెల రాజేందర్ తో పాటు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శీను, విక్రం రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ చంద్ర రెడ్డి మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు నాగరాజు, మేడ్చల్ జిల్లా మహిళ అధ్యక్షురాలు లక్ష్మి ,కిషోర్, రవీందర్ రెడ్డి, రాకేష్ గౌడ్ వివిధ సంఘాల నాయకులు అధ్యక్షులు పాల్గొన్నారు.

# మంగినపూడి మసుల బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్ మధ్య చర్చ

- బందరు చరిత్ర తిరగ రాసేలా మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని నిర్ణయం





**అమరావతి,కలంకౌంటర్ :** బందరు చరిత్ర తిరగ రాసేలా మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్ నిర్ణయించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ 2వ బ్లాక్ లోని మంత్రి కందుల దుర్గేష్ పేషీలో ఈ మేరకు ఇరువురు మంత్రులు భేటీ అయ్యారు. జూన్ 6-8 తేదీల్లో మచిలీపట్నం మంగినపూడి మసూల బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై చర్చించారు. మంగినపూడి బీచ్ అత్యద్భుతమైన పర్యాటక ప్రాంతమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా లక్షలాది సంఖ్యలో తరలివచ్చే సందర్శకులకు తెలిసేలా రాష్ట్ర పర్యాటక రంగానికి తగిన ప్రాచుర్యం కల్పించాలని సూచించారు. అంతేగాక రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించాలని కోరారు. ఇసుక తిన్నెలపై ఉత్సవాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసే స్వాగత తోరణాలు మొదలుకొని సాంస్కృతిక, కళా వైభవాన్ని స్ఫురించేలా, పర్యాటక ప్రాంతాల గొప్పతనం తెలిసేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. మసుల బీచ్ ఫెస్టివల్ కు తరలివచ్చే లక్షలాది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల రేఖా చిత్రపటాన్ని పరిశీలించిన మంత్రి దుర్గేష్ ఉత్సవాల్లో ఏర్పాటు చేసే బందోబస్తు, ప్రదర్శనశాలలు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్, క్రీడల నిర్వహణ, పారిశుద్ధ్యం, జనసమూహ నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై తనదైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా మసుల ఫెస్టివల్ కు సంబంధించిన ప్రోమో వీడియోలను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర సమాధానమిస్తూ ఉత్సవాల్లో భాగంగా పర్యాటకుల వినోదం కోసం జాతీయ క్రీడలైన బీచ్ కబడ్డీ, కయాకింగ్ జల క్రీడలు, హెలీ రైడ్, పారా గ్లైడింగ్, నీటిలో గ్లైడింగ్, స్కూబా డైవింగ్, స్పీడ్ బోట్లు తదితర సాహస క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ సినీ కళకారులు, సంగీత దర్శకులతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా బీచ్ ఫెస్టివల్ విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ సూచించనట్లుగా పర్యాటక రంగానికి తగిన ప్రాచుర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ పాల్గొన్నారు.

# గ్యాస్ రాయితీ ఇక ముందుగానే లబ్ధిదారుల ఖాతాల్లోకి: మంత్రి నాదెండ్ల మనోహర్

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం ఇ-క్యాబినెట్ భేటీ
- దీపం-2 పథకం పురోగతిపై మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి
- తొలి విడతలో సుమారు లక్ష మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు
- రెండో విడత కోసం ఇప్పటికే 70 లక్షల మంది దరఖాస్తు
- మూడో విడతలో గ్యాస్ రాయితీ ముందే లబ్ధిదారుల ఖాతాల్లో జమ



**అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్రంలో 'దీపం-2' పథకం కింద మూడో విడతలో గ్యాస్ సిలిండర్ రాయితీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో ముందుగానే జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం నాడు సచివాలయంలో జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశం అనంతరం ఆయన సచివాలయం నాలుగో బ్లాక్‌లోని ప్రచార విభాగంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, "దీపం-2 పథకం మూడో దశ అమలులో భాగంగా, లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకోకముందే వారి ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా లబ్ధిదారులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. పథకం అమలు తీరును వివరిస్తూ, "దీపం-2 పథకం మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 99,700 మంది ఉచిత గ్యాస్ సిలిండర్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. ప్రస్తుతం అమలవుతున్న రెండో విడతలో భాగంగా, ఇప్పటికే దాదాపు 70 లక్షల మంది ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోవడం జరిగింది" అని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన హామీ ఇచ్చారు. ఇ-క్యాబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

# జగన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడతారు: లోకేశ్ ఫైర్

- తిరుపతి విద్యార్థి ఘటనను జగన్ రాజకీయం చేస్తున్నారు: లోకేశ్
- టీడీపీపై దుష్ప్రచారానికి సాక్షి పత్రికను వాడుకుంటున్నారని ఆరోపణ
- జేమ్స్‌పై దాడి నిందితులు వైసీపీ నేతల అనుచరులేనని వెల్లడి
- జగన్‌దే రక్తచరిత్ర అని విమర్శలు




**అమరావతి,కలంకౌంటర్ :** తిరుపతిలో ఓ దళిత విద్యార్థిపై జరిగిన దాడి ఘటనను అడ్డం పెట్టుకుని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ ఘటనలో నిందితులుగా ఉన్నవారు వైసీపీ నేతల అనుచరులేనని, అయినప్పటికీ టీడీపీపై బురద చల్లేందుకు జగన్, ఆయన కరపత్రిక సాక్షి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీ రాత్రి తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి, దాడి చేసిన ఘటనపై మంత్రి లోకేశ్ స్పందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏ-1 యశ్వంత్, ఏ-2 కిరణ్, ఏ-3 జగ్గ, ఏ-4 లలిత్, ఏ-5 సాయి గౌడ్, ఏ-6 వంశీ, ఏ-7 రూపేష్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారని తెలిపారు. వీరిలో జగదీష్ అలియాస్ జగ్గ, లలిత్ అలియాస్ లలిత్ గోపాల్, నాని, సాయి గౌడ్‌లు మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులని ఆరోపించారు. అలాగే, ఉండు రూపేష్ రెడ్డి అలియాస్ రూపి, సాయి కిరణ్ కుమార్ రెడ్డిలు భూమన అభినయ్ రెడ్డి వద్ద పనిచేసేవారని, వంశీ అలియాస్ చోటా బ్లేడ్ ఎంపీ గురుమూర్తి అనుచరుడని లోకేశ్ పేర్కొన్నారు. "వాస్తవాలు ఇలా ఉంటే, టీడీపీ వారే జేమ్స్‌ను కిడ్నాప్ చేసి దాడి చేశారంటూ సాక్షిలో తప్పుడు కథనాలు రాయించారు. రాజకీయ లబ్ధి కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడే జగన్ రెడ్డి, విద్యార్థుల మధ్య జరిగిన వ్యక్తిగత గొడవను మా పార్టీపై రుద్ది పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. దళిత సోదరులను రెచ్చగొట్టేలా తమ కరపత్రిక సాక్షిలో తప్పుడు రాతలతో విషం చిమ్ముతున్నారు" అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. తిరుపతి ఘటనలో ఇప్పటికే కొందరిని అరెస్టు చేశారని, మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారని, నిందితులు ఎవరైనా, ఎంతటివారైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని ఆయన స్పష్టం చేశారు. "రాజకీయంగా జగన్ రెడ్డి గారి హిస్టరీ యావత్తు ఆసాంతం రక్తచరిత్రే. బాబాయిని బాత్రూమ్‌లో గొడ్డలివేటుతో లేపేసి, బాబుగారి చేతిలో కత్తి పెట్టి, నాడు అవినీతి విషపుత్రిక సాక్షిలో అడ్డగోలు రాతలు రాయించారు. అసలు నిజమేంటో సొంత చెల్లెళ్లతో సహా రాష్ట్ర ప్రజలంతా ఆలస్యంగా తెలుసుకున్నారు" అని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉండగా డాక్టర్ సుధాకర్ మొదలు డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు దళిత సోదరులను ఊచకోత కోసిన జగన్, ప్రతిపక్షంలోనూ అవే పోకడలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తిరుపతి ఘటనలో వాస్తవాలను, జగన్ రెడ్డి కుట్రలను గుర్తించి యావత్ దళిత సమాజం అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# విశాఖ డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన గోవిందరెడ్డికి పవన్ కల్యాణ్ అభినందనలు

- విశాఖ డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిందరెడ్డి ఏకగ్రీవం
- తమ పార్టీ నేతకు కీలకపదవి దక్కడం పట్ల పవన్ హర్షం
- అభినందనలు తెలుపుతూ ప్రకటన విడుదల



**అమరావతి, కలంకౌంటర్ :** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. గోవిందరెడ్డి విశాఖ 64వ డివిజన్ లో జనసేన కార్పొరేటర్ గా ఉన్నారు. తమ పార్టీకి చెందిన నేత డిప్యూటీ మేయర్ కావడం పట్ల జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన దల్లి గోవిందరెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. "64వ డివిజన్ లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన గోవిందరెడ్డి పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలకు అనుగుణంగా అనునిత్యం పనిచేస్తారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయం. గోవిందరెడ్డి డిప్యూటీ మేయర్ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తారని, నగర అభివృద్ధికి, మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తారని, సదా ప్రజల పక్షాన నిలుస్తారని ఆకాంక్షిస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com